క్లుప్తంగా

నేడ విశ్వేశ్వరం పీహెచ్‌సీ భవనం ప్రారంభం

రేపల్లె రూరల్: విశ్వేశ్వరం గ్రామంలో పునః నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు ప్రారంభించనున్నట్లు సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు అంజయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

క్రీడాకారులకు అభినందన

రేపల్లె రూరల్: తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు ఖమ్మంలో జరిగిన బ్రాహ్మణ పురోహిత రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో రేపల్లె పట్టణానికి చెందిన పరుశరామ యువసేన పురోహిత మహా వీర్ టీమ్ విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా టీమ్‌లోని క్రీడాకారులను మంగళవారం పట్టణంలోని బ్రాహ్మణ సంఘాల నాయకులు అభినందించారు. టీమ్ కెప్టెన్ ఆమంచి రమణ సాయి శర్మ మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌కు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 16 జట్లు పాల్గొన్నాయన్నారు. తమ క్రీడాకారుల సమష్టి కృషితో విజేతగా నిలవటం ఆనందంగా ఉందన్నారు.

భక్తిశ్రద్ధలతో పూర్ణాహుతి హోమం

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి ఆలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చనను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడారు. పూజాకార్యక్రమం పూర్తయిన తర్వాత ఏడు వారాల పూజలు ముగిసిన వారితో పూర్ణాహుతి హోమం జరిపించినట్లు తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఎం.ప్రభాకర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

మైక్రో ఆర్కిటెక్చర్ డిజైన్‌పై వర్క్‌షాపు

బాపట్ల అర్బన్ : బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో వీఎల్ఎస్ఐ మైక్రో ఆర్కిటెక్చర్ డిజైన్‌పై సోమ, మంగళ వారాల్లో వర్క్ షాపు నిర్వహించారు. శిక్షణ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా పూర్వ విద్యార్థి, క్వాల్కమ్ టెక్నాలజీస్ యూఎస్ఏ కూరపాటి సాగర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు వీఎల్ఎస్ఐ మైక్రో ఆర్కిటెక్చర్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఒ.నజీర్ మాట్లాడుతూ ఈ టెక్నాలజీలో శిక్షణ తీసుకున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని తెలిపారు. ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, డీన్ అకడమిక్ డాక్టర్ బి.చంద్ర మోహన్, వివిధ విభాగపు అధ్యాపకులు, అధిపతులు పాల్గొన్నారు.

అధిక జనాభాతో.. అనర్థాలు

నగరం: అధిక జనాభా వల్ల కలిగే సమస్యలను ప్రజలకు తెలిపాలని డాక్టర్ భవానీశ్రీ చెప్పారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ధూళిపూడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భవానీశ్రీ మాట్లాడుతూ ఒకరు లేదా ఇద్దరు పిల్లలతో కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల జనాభాను తగ్గించవచ్చన్నారు. పీహెచ్‌సీ నుంచి ర్యాలీ ప్రారంభించి ధూళిపూడి వీధుల్లో ప్రదర్శన చేశారు. డాక్టర్ నజిల్లా పర్వీన్, సీహెచ్‌వో బాబురావు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ పాటించాలి

కొల్లూరు: పెరుగుతున్న జనాభాను నియంత్రించాలంటే.. కుటుంబ నియంత్రణ పాటించడం ముఖ్యమని కొల్లూరు పీహెచ్‌సీ వైద్యురాలు సుష్మసుశాన్ అన్నారు. మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన ప్రదర్శన నిర్వహించారు. సీహెచ్‌ఓలు సుబ్బారెడ్డి, పి. శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

డోరు నంబరు ప్రకారమే ఓటు ఉండాలి

పిట్టలవానిపాలెం: ఓటర్ల జాబితాను పారదర్శకంగా తయారు చేయాలని అందుకు బీఎల్వోలు సహకరించాలని బాపట్ల ఆర్డీఓ గంధం రవీందర్ కోరారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం బీఎల్వోల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 12 నుంచి ఆగష్టు 21వ తేదీ లోపు ఓటర్ల జాబితాలో ఇంటింటి సర్వే నిర్వహించి, తప్పులు, ఒప్పులను సరిచేయాలని తెలిపారు. ఒక్కో ఇంట్లో పది ఓట్లకు మించి ఉన్న గృహాలను సందర్శించి, అందుకు గల కారణాలను పరిశీలించాలని తెలిపారు. తప్పనిసరిగా డోరు నంబర్ ప్రకారమే ఓటు ఉండాలని తెలిపారు. తహసీల్దారు డి.కవిత, బీఎల్వోలు ఉన్నారు.

అయినవాళ్లే అక్కరకు రాలేదు..వలంటీర్లు వద్దనుకోలేదు



" కరోనా విజృంభిస్తున్న సమయంలో బాపట్ల చీలు రోడ్డు సెంటర్‌లో కోవిడ్‌తో ఓ వ్యక్తి ఇంట్లో ఉండిపోయాడు. తలుపులకు గడియవేసుకుని ఇంటి నుంచి బయటకు రాలేదు. అధికారులు అతనున్న ప్రాంతంలోకి ఎవరినీ ప్రవేశించకుండా అడ్డుకట్టలు వేశారు. ఆ ప్రాంతంలో పని చేసే వలంటీర్ సునీత ధైర్యం చేసి మందులు అందించింది. నిత్యావసర సరుకులు తెచ్చి ఇచ్చింది. ఆమె తన ఇంట్లోకి వెళితే..తన పిల్లలకు ఎక్కడ కరోనా వస్తుందోనని.. ఇంటి బయట వరండాలోనే ఉండి...సేవలందించింది. పింఛన్లు కూడా రైతులు పొలాల్లో ఉన్నా.. అక్కడికెళ్లి ఇచ్చింది.

- పవన్ వ్యాఖ్యలపై కొనసాగిన నిరసనలు
- రోడ్లపై బైఠాయించి వలంటీర్ల ఆందోళన
- పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మలు దహనం

బాపట్ల: బాపట్ల పట్టణంలో 20 సచివాలయాల్లో వాటిలో 417మంది వలంటీర్లు పని చేస్తున్నారు. రూరల్‌లో మరో 670 మంది గ్రామ వలంటీర్లు సేవలందిస్తున్నారు. కరోన కోరలు చాచిన సమయంలో వీరంతా ప్రాణ భయాన్ని పక్కనపెట్టి..కరోనాతో బాధపడుతున్న వారికి ధైర్యాన్ని ఇచ్చిన వాళ్లే. ఇచ్చేది రూ.5వేల గౌరవ వేతనమైనా.. బాధ్యతగా పనిచేశారు. నిత్యావసర సరుకుల నుంచి మందుల వరకు ఇంటింటికీ వెళ్లి అందించారు. అయిన వాళ్లే అక్కరకు రాని సమయంలో..వలంటీర్లు తమ విధులను వద్దనుకోలేదు. అలాంటి వలంటీర్లపై రాజకీయ లబ్ధి కోసం జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఏలూరు సభలో అనుచిత వ్యాఖ్యలు చేయడం.. వారిని ఆగ్రహానికి గురిచేసింది. ఒక్కసారి కరోన భయానక పరిస్థితులు తలుచుకుంటే ఎవరు సేవలందించారో.. పవన్ కల్యాణ్‌కు అర్థమవుతుందని వలంటీర్లు మండిపడుతున్నారు.



కోవిడ్ సమయంలో సర్వే నిర్వహిస్తున్న వలంటీర్లు, సచివాలయం ఉద్యోగులు

నిజాంపట్నం: పవన్ కల్యాణ్ తక్షణమే క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. నిజాంపట్నం ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. నిస్వార్థ సేవ చేస్తుంటే.. తప్పుడు ఆరోపణలు చేయడం పవన్ నీచరాజకీయాలకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ నెహ్రూ బాబుకు వినతిపత్రం అందించారు.

నగరం: పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ.. నగరంలో వలంటీర్లు నిరసన ర్యాలీ చేపట్టారు. పవన్ కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ జి.రామకృష్ణకు ఫిర్యాదు చేశారు.

రేపల్లె రూరల్: పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను ఖండిస్తూ.. వలంటీర్లు మంగళవారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. పవన్ కల్యాణ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. తహసీల్దారు మల్లికార్జునరావుకు, ఎస్ఐ అబ్దుల్ రజాక్‌కు వినతిపత్రాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి ఉన్నారు.

వేమూరు: వేమూరు బస్టాండ్ సెంటరులో వలంటీర్లు పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేశారు. వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వలంటీర్లు సీహెచ్ వినోద్, సంజీవ్ గాంధీ, గోపీ, ప్రసన్న, ధనంజి, బెనర్జీ, రమేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెం: పవన్ కల్యాణ్ గ్రామ వాలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గ్రామ వలంటీర్లు కర్లపాలెం మార్కెట్ సెంటర్‌లో నిరసన ప్రదర్శన చేశారు. మానవహారంగా ఏర్పడి పవన్ వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కర్లపాలెం ఎస్ఐ శివయ్యకు పవన్ కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు పత్రం అందజేశారు. గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, కౌశల్ మిత్ర పఠాన్ అబ్దుల్ రహీంఖాన్ మాట్లాడుతూ..కరోనా విజృంభించిన సమయంలోనూ.. బయటి వ్యక్తులు తమ గ్రామాల్లోకి రాకుండా కాపలా కాసి, నిత్యావసర సరుకులు అందజేశామని చెప్పుకొచ్చారు.



నగరం ఎస్ఐ రామకృష్ణకు ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు



నిజాంపట్నంలో ప్రధాన రహదారిపై బైఠాయించిన వలంటీర్లు



చెరుకుపల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద వలంటీర్ల నిరసన

చెరుకుపల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద మంగళవారం మహిళా వలంటీర్లు నిరసన చేపట్టారు. ప్రజలకు సంక్షేమ పథకాలు చేరవేస్తున్న తమపై ద్వేషం వెళ్లగక్కడ..పవన్ కల్యాణ్ నీచత్వానికి నిదర్శనమని మండిపడ్డారు.అంబేడ్కర్ సెంటరులో మానవహారం నిర్వహించి, పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

పిట్టలవానిపాలెం: పిట్టలవానిపాలెం గ్రామంలోని వలంటీర్లు పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. తక్షణమే వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఇంటికే పింఛను..



నేను వేమూరు గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకొని జీవిస్తున్నాను. నా భర్త కూడా చనిపోయాడు. గతంలో ఏ చిన్న పనికైనా.. పనులు మానుకుని కార్యాలయాలు చుటూ తిరిగేదానిని. ప్రస్తుతం వలంటీరు ఇంటికే వచ్చి వితంతు పింఛను అందిస్తున్నారు. కరోనా సమయంలో కూడా క్రమం తప్పకుండా ఇంటికొచ్చి పింఛను నగదు ఇచ్చారు.

– తోడేటి జ్యోతి, వ్యవసాయ కూలి, వేమూరు.

మా కోసం...



వలంటీర్ల సేవలు మాలాగా అంగవైకల్యంతో బాధపడుతున్న వారికి ఉపయోగపడుతున్నాయి. గతంలో పింఛను సొమ్ము తీసుకోవాలంటే ఇలా మూడు చక్రాల సైకిల్‌లో పంచాయతీ కార్యాలయాల చుట్టూ.. రోజుల తరబడి బారులు తీరేవాళ్లం. వలంటీర్ వ్యవస్థ వచ్చాక మా కష్టాలు తీరాయి. మాకు శ్రమ లేకుండానే ప్రతి నెలా 1వ తేదీన ఉదయాన్నే పింఛను మా ఇంటికొచ్చి..మా వలంటీరు ఇస్తున్నారు.

– కనకమేడల అన్నపూర్ణ, దివ్యాంగురాలు, క్రాప.

మాలాంటి వాళ్ల కోసమేగా వలంటీర్లు..



వృద్ధాప్యంతో ఎక్కడకీ కదల్లేని పరిస్థితి మాది. మాలాంటి వారికి వలంటీర్ సేవలు వరంలా మారాయి. ప్రతి నెలా 1న ఉదయాన్నే పింఛను నగదు ఇంటికి తీసుకొచ్చి వలంటీరు ఇస్తున్నారు. కరోనా సమయంలోనూ మా ఇంటికొచ్చి పింఛను ఇచ్చారు. మాకు ఇంతకన్నా ఏం కావాలి.

– పయ్యాల చెంచయ్య, వృద్ధుడు,క్రాప.

నేతాజీ నగర్‌లో కార్డెన్ సెర్చ్



ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్న డీఎస్పీ మురళీకృష్ణ, సీఐలు

రేపల్లె: పట్టణంలోని 24వ వార్డు నేతాజీనగర్‌లో మంగళవారం తెల్లవారుజామున 75 మంది పోలీసు సిబ్బందితో రేపల్లె డీఎస్పీ తక్కెళ్లపాటి మురళీకృష్ణ కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తనిఖీల్లో ఎటువంటి మాదక ద్రవ్యాలు లభించ లేదని తెలిపారు. సరైన పత్రాలు లేని 38 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. యజమానులు వాహనాలకు సంబంధించిన పత్రాలను చూపించని పక్షంలో సీజ్ చేసి, కోర్టుకు హాజరు పరుచుతామని చెప్పారు. గంజాయి, నాటు సారా విక్రయాలపై సమాచారం అందించాలని కోరారు. పట్టణ, రూరల్ సీఐలు నజీర్‌బేగ్, శివశంకరరావు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం ప్రభుత్వ బాధ్యత

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున

కొల్లూరు: ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ, అర్హతున్న ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందజేయడనికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బాధ్యతాయుతంగా పనిచేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. మంగళవారం క్రాప సచివాయంలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలను మభ్యపెట్టి పబ్బం గడుపుకున్న గత టీడీపీ ప్రభుత్వం బుద్ధి తెచ్చుకునే రీతిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గత ప్రభుత్వాలు చేపట్టని తరహాలో ప్రజలకు అవసరమైన ధృవీకరణ పత్రాలను ఒక్కరూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా అందించడం ప్రభుత్వ పనితీరును ప్రతిబింబిస్తుందన్నారు. 30 ఏళ్లగా రహదారి సౌకర్యం లేని క్రాపకు రూ.3 కోట్లు వెచ్చించి రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు మంత్రి తెలిపారు. అనంతరం సచివాలయం పరిధిలోని క్రాప, మొసలిపాడు గ్రామాలకు చెందిన 854 మందికి ధృవీకరణ పత్రాలను మంత్రి అందజేశారు. దోనేపూడిలో జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో 653 మంది లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలు అందించారు. వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఉపసర్పంచ్ అంకమ్మరావు, ఈపూరు సొసైటీ బ్యాంక్ చైర్మన్ సూర్యదేవర రామకృష్ణ, మండల ప్రత్యేకాధికారులు రమణ, రామదాసు, తహసీల్దారు ఎ. శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఐ.సత్యనారాయణ రావు, ఈఓపీఆర్డీ రవికుమార్, ఏపీఎం రాము, జేసీఎస్ మండల ఇన్‌చార్జి అయిల సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



క్రాపలో అర్జీదారులకు ధ్రువ పత్రాలు అందజేస్తున్న మంత్రి నాగార్జున

పవన్ కల్యాణ్ తక్షణం క్షమాపణ చెప్పాలి

పిట్టలవానిపాలెం: గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్ వెంటనే క్షమాపణ చెప్పాలని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి డిమాండ్ చేశారు. మంతెనవారిపాలెం, అల్లూరు గ్రామ సచివాలయాల వద్ద మంగళవారం జగనన్న సురక్ష శిబిరాలు జరిగాయి. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కోన పాల్గొన్నారు. ఏలూరు సభలో వలంటీర్లపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కోవిడ్ మహమ్మారి కోరలు చాచిన సమయంలో.. సొంత కుటుంబ సభ్యులే దగ్గరకు రాలేని పరిస్థితిలో ఇంటింటికీ వెళ్లి సేవలందించారని గుర్తుచేశారు. వలంటీర్ల ద్వారా 16 కోట్ల మాస్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. చంద్రబాబు నాయుడు రాసిచ్చిన స్క్రిప్టు చదవడం పవన్ కల్యాణ్ అజ్ఞానాన్ని తెలియజేస్తుందని మండిపడ్డారు. పవన్ కల్యాణ్‌పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు యేట్ర అశ్వినిరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఉయ్యూరి లీలాశ్రీనివాసరెడ్డి, ఎంపీపీ షేక్ బాజి, వైస్ ఎంపీపీలు చేబ్రోలు కృపానందం, దెందుకూరి సీతారామ రాజు, గోవతోటి విజయ్ పాల్గొన్నారు.

బాపట్ల అర్బన్: బాపట్ల మండలంలోని చెరువు జమ్ములపాలెం 1, 2 సచివాలయాల్లో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాల్లో ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొన్నారు. అర్జీదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. జమ్ములపాలెం 1 సచివాలయానికి 1,094 మంది, రెండో సచివాలయానికి 1,033 మందికి ధృవీకరణ పత్రాలు అందజేశారు. పార్టీ మండలాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్న పోతుల హరి బాబు, జేసీఎస్ కన్వీనర్ వడ్డిముక్కల డేవిడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ కృష్ణమూర్తి, డీఈఈ రామారావు, తహసీల్దారు సుధారాణి, ఎంపీడీవో ఎ.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన

సూరేపల్లి/ఐలవరం(భట్టిప్రోలు): జగనన్న సురక్షతో ప్రభుత్వ పాలనలో వినూత్న మార్పుకు శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. సూరేపల్లి, ఐలవరం-2 సచివాలయాల్లో మంగళవారం జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించారు. రెండు సచివాలయాల్లో మొత్తం 2102 మంది అర్జీదారులకు ధృవీకరణ పత్రాలు అందించారు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు మండల కేంద్రం గ్రామ సచివాలయంలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష శిబిరం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పాల్గొన్నారు. 1047 అర్జీలు పెట్టుకోగా..1,047 సర్టిఫికెట్లు అందించారు. వాటిలో కుల ధృవీకరణ పత్రాలు 483, ఆదాయ సర్టిఫికెట్లు 472, కౌలు గుర్తింపు కార్డులు 48, ఆధార్ సర్వీసు 15, మరణ ధృవీకరణ పత్రాలు 15, జనన ధృవీకరణపత్రాలు 8, గృహ నిర్మాణం కోసం 2 అందజేశారు. ఎంపీపీ రాపర్ల నరేంద్ర, కూచిపూడి శ్రీనివాసరరావు, ఎంపీడీవో సుభాని, అధికారులు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు అందాలి

నిజాంపట్నం: ప్రతి పేదవాడికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మోపిదేవి హరనాథబాబు తెలిపారు. బొర్రావారిపాలెంలో మంగళవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. హరనాథబాబు పాల్గొన్నారు. బొర్రావారిపాలెంలో నూతనంగా నిర్మించిన సామాజిక మరుగుదొడ్లను ప్రారంభించారు. జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, కూచినపూడి సహకార సొసైటీ అధ్యక్షుడు నల్లపాటి రామయ్య, బండారు రామారావు, ఎంపీడీవో నాగలక్ష్మి, మండల స్పెషల్‌ఆఫీసర్ సురేష్, సర్పంచ్ కేసన నాగముత్యాలమ్మ, కేసన సోమయ్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన

- ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు
- నిజాంపట్నంలో గడప గడపకు మన ప్రభుత్వం



నిజాంపట్నంలో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీ మోపిదేవి

నిజాంపట్నం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. నిజాంపట్నంలోని సచివాలయం-4 పరిధి పసువర్తివారిపాలెంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ కుల మతాలకు, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తెలిపారు. పసువర్తివారిపాలెంలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. అర్హులై ఉండి ఎవరికైనా సంక్షేమ పథకాలు అందడం లేదా..? అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి విజయ నిర్మల, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, మోపిదేవి హరనాథబాబు, ఎంపీటీసీ నాజర్‌ఖాన్, సర్పంచ్ కట్టా పోలేరమ్మ, తహసీల్దారు నెహ్రూబాబు, ఎంపీడీవో నాగలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.